
ఓం నమోభగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 5 పుష్పం : 13-15 20-11-2001

ష్ట్రజుఖజుశ్రీజు ఔకజుఐచజుష్ట్రజు
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 12

**VOL : 7** **ISSUE : 5**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
ష్ట్రజుఖజుశ్రీజు ఔకజుఐచజుష్ట్రజు
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

## శాంతి

శారీరకఆరోగ్యమునకు, మానసిక ఆరోగ్యమునకు శాంతి ముఖ్యము. శాంతచిత్తము కలవాడు అదృష్టవంతుడు. అహంకారములేనివాడికి, మమకారములేనివాడికి శాంతి లభిస్తుంది. మానవుడు హృదయములోనే శాంతిఉన్నది. హృదయములో మనస్సు, వాక్కు లయము అయినవాడికి శాంతితెలుస్తుంది. శాంతిలేనివాడికి ఆనందములేదు. జపధ్యానములుచేసి దేహాత్మబుద్ధిని నశింపచేసుకొని బ్రహ్మాత్మ బుద్ధిని పొందినవాడికి జ్ఞానోదయమవుతుంది. బ్రహ్మాజ్ఞానమే మోక్షము. బ్రహ్మావే నారాయణుడు. వైకుంఠంలోఉన్న నారాయణుడే మన హృదయములోకూడా ఉన్నాడు. ఆయనకు ఆత్మనివేదనము చేసిన వెంటనే ఆయన అనుగ్రహమువలన శాంతికల్గుతుంది.

**ఈ సంచికలో...... సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**

30-10-2001 నర్సాపురం ........ 3
01-11-2001 ఇలపర్రు ........ 6
04-11-2001 జిన్నూరు ........ 12

సమాజములోఉన్న వివాదములకు, కుటుంబములో ఉన్న కలహములకు మానవుడులోఉన్న అశాంతికారణము. మిధ్యాజ్ఞానముతో అశాంతిని అతిక్రమించలేము. సత్కర్మలుచేసి, సహృదయముఉన్నవాడితో సహవాసముచేసి అనుదినము ప్రయత్నముచేసి సాత్త్వికబుద్ధిని సముపార్జించి ఆత్మజ్ఞానమును సంపాదించిన ఎడల అశాంతినుండి విడుదలపొందవచ్చును. ఏది తెలియబడితే శాంతి తెలుస్తుందో అదేఆత్మజ్ఞానము. తామసిక, రాజసికకర్మలు అశాంతినికల్గిస్తాయి. సాత్త్వికకర్మకళ్యాణగుణములను ప్రసాదిస్తుంది, నిశ్చలత్వమును కల్గిస్తుంది. ఆధ్యాత్మిక పురోగతికి, ఆత్మానుసంధానమునకు సత్త్వగుణము అవసరము. సాధ్యమైనంతవరకు వ్యవహారములకు దూరముగా ఉండాలి. మాటలోకోపము, కపటము ఉండకూడదు. ఆలోచనలో ఉద్రేకము ఉండకూడదు. సమానచిత్తము కలవాడికి మిగిలేదిశాంతి. వివేకములేనివాడు, సహనములేనివాడు సమాహిత చిత్తమును సాధించలేడు. ఏరోజుకారోజు రాగద్వేషములకు పరవసుడైనవాడికి శాంతి సంభవించదు. మంచిగాలేనివాడు చెడుగానే ఉంటాడు. శాంతిలేనివాడు అశాంతిగానే ఉంటాడు. శాంతికలవాడు మాత్రమే జీవితములోఉన్న మాధుర్యమును రుచిచూడగలడు, కర్మను యోగముగా నిర్వర్తించగలడు. మనిషిచేస్తున్న కర్మ అతని జీవనయాత్రకు సహకరించటంతోపాటు దైవమును తెలుసుకొనుటకుకూడా సహకరించాలి. దైవముతో నిరంతరము అనుసంధానము పెట్టుకోవటమువలన ప్రకృతి గుణములను దాటవచ్చును. ప్రకృతిని దాటకుండా శాశ్వతశాంతిని సాధించలేము. శాంతిలో స్థిరపడినవాడికి మరణభయము ఉండదు. స్వార్ధమే పరమార్ధముగా భావించినవాడికి ఏ జన్మకాజన్మ అశాంతి వెంటాడుతూఉంటుంది. అశాంతి సంసారమూలము. శాంతి మోక్షమూలము.

- సద్గురు శ్రీనాన్నగారు

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-10-2001, నర్సాపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

షిర్డీ సాయిబాబా సర్వదేవతాస్వరూపుడు. ఆయన కొంతమందికి రాముడిగా, కొంతమందికి దత్తాత్రేయుడుగా దర్శనమిచ్చారు, నాకు ఆంజనేయస్వామిగా దర్శనమిచ్చారు. ఆయనను కోరికలు నెరవేర్చే దేవుడుఅంటారు. బాబాఅంటే భగవంతుడే అని పరిపూర్ణమైన విశ్వాసంతో ఆయనను ఆరాధించినవారికి అనేక మహిమలు జరిగినాయి, వారి కోరికలుకూడా నెరవేరినాయి. బాబా శరీరం ఇప్పుడులేదుఅని బాబాలేరుఅని అనుకోవద్దు. శరీరానికి మరణం ఉంటుందిగాని గురువుకు మరణంలేదు. బాబాశరీరం ఇప్పుడులేదుఅని బాబాలేరుఅని అనుకొంటే జీవితంలో మనం చాలానష్టపోతాము. ఒక భక్తుడు బాబాగారిని ఏదోకోరిక అడుగుతూఉంటే ప్రక్కనఉన్న భక్తుడు ఎందుకు చిల్లరికోరికలు కోరుతున్నావు, ఆయన మోక్షం ఇవ్వగలసమర్థుడు, మోక్షం అడుగు అనిచెపుతాడు. అప్పుడు బాబాగారు అతనిని వారించి ఆయన ఏదోకోరిక అడుగుతున్నాడు అడగనియ్యి, కంగారుపెట్టవద్దు. ఆయన కోరికను నెరవేర్చినతరువాత అప్పుడు ఆయన మొఖాన్ని మోక్షంవైపు త్రిప్పదాముఅని చెప్పారు. బాబాగారు ఏమిచెప్పారుఅంటే నేనుమీకు కొన్నికోరికలు నెరవేరుస్తున్నాను. మీకు ఆ కోరికలు నెరవేర్చాలిఅని ఆ కోరికలు నెరవేర్చటంలేదు. మీరుఏద్వైతే కోరుకోవాలిఅని నేను అనుకొంటున్నానో ఆకోరిక ఏనాటికయినా మీరుకోరుకొంటారుఅని ఈ చిల్లరకోరికలు నెరవేరుస్తున్నానుఅని చెప్పారు. మీకుఅందరికి మోక్షంకావాలి, ఆత్మజ్ఞానంకావాలి. మోక్షంవైపుకు మీమొఖం త్రిప్పటానికి ఈ చిల్లరకోరికలు నెరవేరుస్తున్నానుఅని బాబాచెప్పారు.

మనం పొందవలసింది మన హృదయంలోనేఉంది. అదేఆత్మ, అదేబ్రహ్మం, అదేచైతన్యం. దానిస్వరూపమేఆనందం, దానిస్వరూపమేశాంతి, దానిస్వరూపమే ఉండటం గురువుయొక్క చూపుద్వారాగాని, మాటద్వారాగాని ఒక జ్ఞానకణం నీకు అందిందా నీవు ఆ గూటిలోనికి వెళ్ళిపోతావు. గురువుయొక్క మాటఅనుగ్రహం, చూపుఅనుగ్రహం, ప్రతీ కదలికఅనుగ్రహం, ఆయనదేహం ధరించి ఉండటమేఅనుగ్రహం. గడ్డిమేటి ఎంతపెద్దదిఅయినా దానిని కాల్చటానికి ఒక్క అగ్గిపుల్లచాలు. అలాగే నీలో ప్రారబ్దకర్మఎంతఉన్నా, ఎన్నిబలహీనతలుఉన్నా ఒక్కజ్ఞానకణం నీకుఅందినప్పడు ఆకర్మఅంతా భస్మమయిపోతుంది. అంతేకాదు ఈ జన్మలు, మరణాలు అన్నీ స్వప్న సమానమని నీకు తెలుస్తుంది. జ్ఞానకణం నీకు అందినప్పడు అది కర్మను అంతాకోసి,

కోసి నీహృదయంలోఉన్న వస్తువునుపట్టిఇస్తుంది. నేను చెప్పేమాటలు మీకు ఎలా ఉపయోగపడాలిఅంటే ఈ మాటలు మీ అహంకారమునకు కోతక్రింద ఉపయోగపడాలి అంతేగాని మీ అహంకారాన్ని ఉబ్బించేమాటలు నేను చెపుతూ, నా అహంకారాన్ని ఉబ్బించే మాటలు మీరు చెపుతూఉంటే ఎక్కడికి వెళతాము? చీకటిలోకాలకు వెళతాము. గురువుమాట అహంకారానికి కోత. ఇప్పడు మనం ఏద్వైతే నేను, నేను ఉంటున్నామో అదిమిధ్యానేను. అందులోనే కల్మషంఅంతాఉంది. ప్రపంచంలోఉన్న అశాంతికి ఈ నేనేకారణం. ఈనేను దేహంతోటి, మనస్సుతోటి, ప్రపంచంలోఉన్నవస్తువులతోటి, స్వార్థంతోటి, మిత్రులతోటి కలిసిఉంటుంది. ఎవరు ఏమార్గంలో ప్రయాణంచేసినా ఈనేనునుండి విడుదలపొందాలి. ఈ నేనులోనుండి విడుదల పొందితేగాని నీహృదయంలోఉన్న సద్వస్తువు ఉన్నది ఉన్నట్లుగా నీకుతెలియబడదు. మన హృదయంలోఉన్న వస్తువును తెలుసుకోవటానికి మనలో చాలా ఆటంకాలు ఉన్నాయి. భగవంతుడిని స్మరించటంవలన, మహాత్ములను ఆరాధించటంవలన, గురువు చెప్పిన మాటలను ఆచరించటంవలన మనలోఉన్న ఆటంకాలుఅన్నీ తొలగిపోతాయి. మనకు ఉపయోగంలేని తలంపులు అనేకంవస్తూఉంటాయి. భగవంతుడి నామాన్ని స్మరించటంవలన ఆతలంపులుఅన్నీ తొలగిపోతాయి, చివరకు అదికూడాపోతుంది. అప్పడు లోపలఉన్న వస్తువుఉన్నదిఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. లోపలశివుడు ఉన్నాడు. ఆ శివబుద్ధి నీకు కలుగకుండా శవబుద్ధి అడ్డువస్తోంది. అందువలన శవబుద్ధిని తొలగించుకోవటం మీదే నీ సాధనను గురిపెట్టు. నీవుచేసేపూజ, జపం, ధ్యానం ఇవి అన్నీకూడా శవబుద్ధినుండి విడుదలపొందటానికి నీకు సహకరించాలి. నీవుస్వార్థంలేకుండా, ఆడంబరంలేకుండా పనిచేస్తావుఅనుకో, ధ్యాన్యంచేసినవారు ఏస్థితిని పొందుతారో నీవుకూడా అదేస్థితిని పొందుతావు. అహంకారమునకు మరోరూపమే శరీరంఅనిచెపుతారు. అహంకారం ఈ శరీరంలేకుండా ఉండలేదుకాబట్టి దానికి మరల శరీరంవస్తుంది. అదేపునర్జన్మ. దేహము, మనస్సు ఇవిఅన్నీ అహంకారముయొక్క రూపములే. అహంకారమే ఈ రూపాలు ధరించివస్తోంది అని మనకు అర్థంకాకపోతే అహంకారముఅనే పిడికిలినుండి బయటకురాలేము. ఇష్టం, అయిష్టంకూడా అహంకారముయొక్క చేష్టలే. అహంకారంఉంటే నువ్వుఉన్నావు, నేనుఉన్నాను, పుణ్యంఉంది, పాపంఉంది, మరణానంతర జీవితంఉంది అదిలేకపోతే ఏదీలేదు, నీవేమిగులుతావుఅంటే శుద్ధచైతన్యంఒక్కటేమిగులుతుంది. జీవకోటిని

అక్కడికి తీసుకొని వెళ్ళటానికే బాబాగారి ప్రయత్నం. నాకు సన్మానంచేయాలిఅనుకోవటం అహంకారం, సన్మానంచేస్తాముఅంటే వద్దు, వద్దు అనటంకూడా అహంకారమే. అహంకారంయొక్క రూపంఎలాఉంటుందోచూడండి. వద్దు, వద్దు అనటం అవినయానికిగుర్తు. నీమాటలోగాని, నీచేతలోగాని ఎప్పడూ అవినయంరాకుండా చూసుకో, అదేసాధన. మాటలోగాని, చేతలోగాని హింసాప్రవృత్తి పనికిరాదు. హేళనగామాట్లాడటంకూడా హింసాప్రవృత్తే. నీవు మాట్లాడేమాట నీకుశాంతిని ఇవ్వాలి, ఇతరులకు శాంతినికలుగజేయాలి. అవసరంఉన్నప్పడు మాట్లాడాలి. అవసరంలేనప్పడు మాట్లాడటం ఎంతపొరపాటో, అవసరంఉన్నప్పడుమాట్లాడకుండా ఉండటంకూడా అంతేపొరపాటు.

అహంకారం అణిగిఉంటుంది. ఏదోతలంపు వచ్చినప్పడు దానితో తాదాప్యం పొందుతుంది. అది ఏతలంపుతో తాదాప్యంపొందుతోందో అదే మనకు నిజం అనిపిస్తుంది. దానికి అనుగుణంగా ఆడుతూఉంటుంది. మనం చూసుకుంటే తెలుస్తుంది. లోపల పరిశీలన అవసరం. మానవుడు అహంకారంకోసమే జీవిస్తున్నాడు, ఆత్మజ్ఞానంకోసం జీవించటంలేదు. మిమ్మల్ని ఎవరైనా పొగిడారుఅనుకోండి. పొగడ్తకుముందు మీరు ఎంత నిర్వికారంగాఉన్నారో, పొగిడినతరువాతకూడా అంత నిర్వికారంగాఉండాలి. మిమ్మల్ని ఎవరైనా విమర్శించారు అనుకోండి. విమర్శించకముందు మీరుఎంతనిర్మలంగాఉన్నారో, విమర్శతరువాతకూడా అంతనిర్మలంగా ఉండగలగాలి. అప్పడు మీరుఅహంకారరహితంగా జీవిస్తున్నారుఅని అర్ధం. దేహభావనలోనుండి ఈశ్వరభావనలోనికి రావటానికి బహుజన్మలకృషి అవసరం. నీవు పరమపవిత్రుడవుకావాలి, నీబుద్ధి సూక్ష్మంఅవ్వాలి. నీబుద్ధికి సూక్ష్మత్వంవచ్చినప్పడే నీహృదయంలో సూక్ష్మంగాఉన్న భగవంతుడు నీకు తెలియబడతాడు. మాకు శాంతిలేదు, మాకు శాంతిలేదు అంటారు. భగవంతుడిని చేరుకొనేవరకూ ఎవరికీ శాంతిలేదు. మనకు శాంతిస్థానం భగవంతుడే. ఆయనను చేరుకొనేవరకూ ఎవరికీ శాంతిలేదు. పరిస్థితులు అనుకూలంగాఉన్నా, ప్రతికూలంగాఉన్నా ఈశ్వరుడిపాదాలను విడిచిపెట్టకుండాఉంటే మనకు శాంతికలుగుతుంది. నేనుపుట్టానుఅనుకొనేవాడికి చావుఉంది, నేను చనిపోతున్నానుఅనుకొనేవాడికి పుట్టుకఉంది. ఏదిపుడుతోంది? శరీరంపుడుతోంది. నీవు శరీరం అనుకొంటున్నావు. కాబట్టి నేను పుట్టాను అనుకొంటున్నావు. నీవు నిజంగా శరీరం అయితే నేను శరీరమును అనుకొన్నా ఫరవాలేదు. నీవు శరీరం కాదు. కాని నేను శరీరమును అనుకొంటున్నావు. నీవుకానిదానిని నీవుఅనుకొంటున్నావు అదే ప్రమాదమును తీసుకొనివస్తుంది. ఇది మనం అర్ధంచేసుకోవాలి. ఇప్పడు మనం అందరమూపుట్టాము అనుకొంటున్నాము. పుట్టినవారు అందరూ చావటానికి సిద్దంగా ఉన్నారు. చనిపోయినవారు అందరూ పుట్టటానికి సిద్దంగా క్యూలోఉన్నారు. వారికీ మోక్షంలేదు, వీరికీ మోక్షంలేదు. పుట్టినది చనిపోతుంది. ఏదైతే పుట్టలేదో దానికి చావులేదు. ఆ పుట్టుకలేని వస్తువు నీ హృదయంలోనే ఉంది. నీహృదంలోఉన్న పుట్టుకలేని వస్తువు నీకు తెలిసినప్పడు అసలు నేను పుట్టలేదుఅన్న సంగతి నీకు అనుభవంలోనికి వస్తుంది. అదే నీకడసారిజన్మ.

దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు. నీపనిఏదోనీవుచేసుకో. ప్రారబ్దంలో ఏదిరావలసిఉంటే అదివస్తుంది. నీపనిఏమిటిఅంటే ఆత్మజ్ఞానసముపార్జన, అదిచూసుకో. దేహానికి గౌరవంవస్తే పొంగిపోకు, అగౌరవంవస్తే కృంగిపోకు. ఇవిఅన్నీ దేహానికి సంబంధించిన విషయములు. దేహం ఎంతనిజమో ఇవిఅన్నీకూడా అంతేనిజం. నీదేహాన్ని, మనస్సును ఉపయోగించుకొని నీహృదయంలోఉన్న మరణంలేని వస్తువును తెలుసుకోవటానికి ప్రయత్నించు. మాయఎక్కడోఉంది, అజ్ఞానంఎక్కడోఉంది అనుకోకు. ఇవిఅన్నీ నేనురూపంలోఉన్నాయి. ఆనేనును తీసి ఒకప్రక్కనపెట్టు. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా, ఏగురువును ఆశ్రయించినా ఈమిధ్యానేనులోనుండి విడుదలపొందు. నీవులావుగాఉన్నావుఅంటేకోపం, నీవుసన్నగాఉన్నావుఅంటేకోపం, నీవునల్లగాఉన్నావుఅంటేకోపం, నీకుబాగాఉందిఅంటేకోపం, నీకుఏమీలేదుఅంటేకోపం అంటే అహంకారం అనేకరూపాలుదాల్చుతోంది. కాని దానికిరూపంలేదు. అదిరూపంలేని పిశాచం. అందువలన వివేకంపెంచుకొని, సత్పురుషులసహవాసంచేసి, విచారణచేసి అందులోనుండి బయటకురా. చిల్లరవిషయాలు పట్టుకొని నీ కాలాన్ని, శక్తిని వృధాచేసుకోవద్దు. భగవంతుడు ఉన్నాడా, లేడాఅనే అనుమానం పెట్టుకోవద్దు. భగవంతుడుఉన్నాడుఅని సజీవమైన విశ్వాసం పెట్టుకొని ఆయనను అర్చనచేయండి. భగవదనుగ్రహానికి పాత్రులవ్వండి. ఒకసారి భగవాన్‌తో ఒకభక్తుడు మీరు కుమారస్వామి అవతారంఅంటున్నారు అనిఅంటే గుడిలో రాయినిపెట్టి రాముడుఅని, శివుడుఅని అంటున్నారు. అలాగే ఈ దేహాన్ని కుమారస్వామిఅంటే అనుకోనివ్వండి, ఇందులో ఏముందిఅన్నారు. ఎంత చిన్నవిషయంగా చూసారో చూడండి ఈ దేవతలు, చావులు, పుట్టుకలు ఇవిఅన్నీ దొంగనేనుకే. అదిపోతే అన్నీ అదృశ్యమయిపోతాయి అలాగని ఆయనకు దేవునిమీద గౌరవంలేదుఅనికాదు. చావుపుట్టకలులేని పరమసత్యంవైపుకు మనలను గెంటుకొని వెళ్ళటానికి చేసేప్రయత్నంఅది. వాడే నిజమైన గురువు.

20-11-2001

**రమణ భాస్కర**

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-11-2001, ఇలపర్రు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కులాలువేరైనా, మతాలువేరైనా, జాతులువేరైనా, గురువులువేరైనా భగవంతుడుఒక్కడే. మీరు బాబాభక్తులుఅనుకోండి. నేను రమణమహర్షి భక్తుడనుఅనుకోండి. మిమ్మల్ని బాబారూపంలో అనుగ్రహించినా, నన్ను రమణమహర్షి రూపంలో అనుగ్రహించినా ఆరూపంకాదు మిమ్మల్ని అనుగ్రహించేది, అనుగ్రహించేవాడు లోపల అంతర్యామిగాఉన్న ఈశ్వరుడే. రూపాలుతేడా కాబట్టి వాడువేరు, వీడువేరు అనుకోవద్దు. ఎవరిని ఏరూపంలో అనుగ్రహించినా అనుగ్రహించేవాడు ఒక్కడే. ఇది మనకు అర్థమవ్వాలి. ఇదికూడా అర్థంకాకపోతే మనకు ఆత్మజ్ఞానం ఎలాకలుగుతుంది. షిరిడీబాబా ఎప్పడూ ఆయన కులంచెప్పలేదు, మతంచెప్పలేదు. వాటిగురించి అడిగితే ఎందుకు వాటిగురించి అనేవారు. మీరు తెలుసుకోవలసింది ఏమిటి? తెలుసుకోవలసిన వస్తువును తెలుసుకోండి, ఈగొడవలు ఎందుకుఅనేవారు. మనతో ఏమిమాట్లాడినా, ఎలామాట్లాడినా, ఏమిచేసినా మనలను ఎక్కడికి తీసుకొనివెళ్ళాలో ఆగమ్యంమటుకు వారుమర్చిపోరు. అవతారపురుషులు, జ్ఞానులు మనలను అనుగ్రహించకుండా ఉండలేరు. వారు ఏదిచేసినా మనలను అనుగ్రహించటానికే చేస్తారు. ఆత్మసాక్షాత్కారం అయ్యాక సహజంగానే శక్తికలుగుతుంది, జ్ఞానంకలుగుతుంది. జ్ఞానికిఏమైనా సిద్ధులు వచ్చాయిఅనుకోండి. అవి వారు దేవుడిని అడిగితెచ్చుకోరు. మనం మెడలో బంగారువస్తువులు ఎలా అలంకరించుకొంటామో అలాగే జ్ఞానికి సిద్ధులు భగవంతుడే అలంకరింపజేస్తాడు. అది దేవునిప్రసాదం. వారు సిద్ధులుకావాలి అనుకోరు ఎందుచేతనంటే కావాలనుకొనేవాడు అక్కడలేడు. అనుకొనేవాడు అక్కడఉంటేవాడు జ్ఞానికాదు. జ్ఞానాన్ని ఏ సిద్ధితోను పోల్చటానికి వీలులేదు, అలాపోలిస్తే జ్ఞానాన్ని అగౌరవపరచినట్లు అవుతుంది. ఆత్మజ్ఞానమే గొప్పసిద్ధి. ఆత్మజ్ఞానానికి మించిన సిద్ధిలేదుఅని మనకు తెలియదు, అది జ్ఞానికి తెలుస్తుంది.

అహంకారంఉంటే అంతా ఉంది, అదిలేకపోతే ఏదీలేదు. మన జీవితవిధానం సరిగాలేదు. మనం అహంకారమును సంతృప్తిపరచుకోవటం కోసం జీవిస్తున్నాము. అహంకారమును సంతృప్తిపరచుకోవటంకోసం జీవిస్తూఉంటే అహంకారమునుండి ఎలా బయటపడగలము, మనకు ఆత్మజ్ఞానం ఎలాకలుగుతుంది. పూర్వం మనకు ఎంతఉంటే అంతే అని ప్రతీదానికి సంతృప్తిపడేవారు. కాని ఇప్పడు పోటీ పెరిగిపోయింది. వారికంటే మనం ఎక్కువ ధనంసంపాదించాలి, ఎక్కువ గౌరవం సంపాదించాలి అని ప్రతీవిషయానికి పోటీ పెరిగిపోయింది. దానివలన అశాంతి వచ్చేస్తోంది. అశాంతినుండి బయటకురావటానికి ఏదోకొద్దిసేపు ధ్యానాలు, యోగాభ్యాసాలు చేయటం. ఇవిఅన్నీ మంచివేకాని మనం దైనందిన జీవితంలో అహంకారమును సంతృప్తిపరచటంకోసం జీవిస్తూఉంటే భగవంతుడు మనకు తెలియబడడు. భగవంతునికి ప్రీతికలిగించే పనులుచేస్తూఉంటే భగవంతుడు మనకు తెలియబడతాడు. మీరు చేసే ఛమత్కారములవలన ఆయన తెలియబడడు. మనోనాశనం అవ్వాలి. మనోనాశనం అయితేగాని లోపలఉన్న భగవంతుడు మనకు తెలియబడడు. ఏదో దేవునిప్రార్థిస్తున్నాను, ఏదోసాధన చేస్తున్నాను అంటేకుదరదు. మనోనాశనంఅవ్వాలి. భగవంతుడు ఒక్కడే ముస్లింలను ఏ దేవుడు అనుగ్రహించాడో మనలనుకూడా ఆయనే అనుగ్రహిస్తాడు. కులబేధాలు, మతబేధాలుపెట్టుకొని ప్రపంచాన్ని పాడుచేసుకొంటున్నాము. నేను ఇక్కడకువచ్చి రమణమహర్షి ఒక్కడే దేవుడుఅని చెపుతానుఅనుకోండి. రమణమహర్షి పుట్టకముందు ఈ ప్రపంచంలేదా? ఎవరూతరించలేదా? అయితే మనం మహాత్ములను, జ్ఞానులను గౌరవించటం, ఆరాధించటం ఎందుకుఅంటే మనం ఏ వస్తువును తెలుసుకోవాలి అనుకొంటున్నామో వారు ఆ వస్తువును తెలుసుకొన్నారు కాబట్టి వారిని గౌరవించి, వారు చెప్పిన మాటలను శ్రవణంచేసి, వాటికి అనుగుణంగా జీవించి వారి అనుగ్రహానికి పాత్రులయితే

**ప్రతివాడూ అహంకారపు పిడికిలిపట్టులో చిక్కుకొని వున్నాడు. ఆ పట్టును వదలించుకోవాలంటే, సాధకుడు క్రొత్త వాసనలు సృష్టించుకోకుండా వుండడం అవసరం.**

\- భగవాన్ శ్రీ రమణమహర్షి

వారు తెలుసుకొన్న వస్తువు మనకుకూడా తెలుస్తుంది.

భర్త మన శ్రేయస్సును కోరుతున్నాడుఅని భార్య అనుకొంటుంది, భార్య మన శ్రేయస్సునుకోరుతోందిఅని భర్త అనుకొంటాడు కాని మన శ్రేయస్సును నూటికినూరుపాళ్ళు వాంఛించేవాడు భగవంతుడుఒక్కడే. మనకు భగవంతునికంటే గొప్ప మిత్రుడుగాని, గొప్పబంధువుగాని ఎవరూలేరు. భగవంతుడు మనలను ప్రేమించినట్లు ఈ సృష్టిలో ఎవడూ మనలను ప్రేమించలేడు. ఎందుచేతనంటే మనం ఆయన బిడ్డలము. జీవితంలో ఎప్పడైనా మనకు కష్టాలువస్తూఉంటాయి, కంగారుపడవద్దు. ఆకష్టాలు ఇక్కడ అనుభవింపచేసి మనలను ఆయనలో కలుపుకొంటాడు. ఆ కష్టాలు ఇక్కడ అనుభవించముఅనుకోండి, వాటిని అనుభవించటానికి ఇంకో శరీరంఇవ్వాలి. ఇది మనకు అర్థంకాకపోతే భగవంతుడికి మనం అంటే ఇష్టంలేదు అనుకొంటాము, ఆయనమీదకోపం తెచ్చుకొంటాము. విషయచింతనవద్దు, దైవచింతనపెంచుకోండి. విషయచింతనవలన మనస్సు మురికిఅవుతుంది. ఆత్మచింతనవలన మనస్సులోఉన్న మురికిపోతుంది. హరిని కీర్తించండి, శివుడిని అభిషేకించండి. మీకు జ్ఞానంకలుగుతుంది. హరినామం ఎప్పడూ మన మనస్సులో ఉండాలి. ఇదిఅంతా మనం బాగుపడటానికే చేయమంటున్నారు. హరినామంచేయకపోయినా, శివుడికి అభిషేకంచేయకపోయినా వారికివచ్చే నష్టంలేదు. నీవు హరికీర్తనచేయకపోయినా హరిహరిలాగే ఉంటాడు, వారు ఎలాఉన్నారో అలాగేఉంటారు. ఇప్పడు మీరు ఎన్నో ఆనందాలు అనుభవిస్తున్నారుకదా. బ్రహ్మానందం కలిగినప్పడు ఈ ఆనందాలుఅన్నీ అందులో కలిసిపోతాయి. బ్రహ్మంను తెలుసుకొంటే ఈ సుఖాలుఅన్నీ పోతాయిఅని మీకు అనిపిస్తుందిగాని ఎక్కడికిపోవు బ్రహ్మంలో కలిసిపోతాయి. పని, భక్తి రెండూకలవాలి. ఇవిరెండూ కలిస్తేనే అప్పడు మీజీవితం ఉజ్వలంగా ఉంటుంది. ఇంటిదగ్గర మీపనిమీరు శ్రద్ధగాచేసుకోండిఅని చెపితేనే మామీద కోపంవస్తూఉంటే ఇంక మీకు ఏమిచెపుతాము. శరీరం స్మశానంకు వెళ్ళేవరకు పని, భక్తి రెండూ కలుపుకొని జీవించండి. వచ్చేది ఏదోవస్తుంది. దేనికోసం ఎదురుచూడవద్దు. ఆయన ఎప్పడు ఇవ్వాలో ఆ ముహూర్తం ఆయనే పెట్టుకొంటాడు. భక్తిపేరుమీద పని విడిచిపెట్టవద్దు. దానివలన సోమరితనం వస్తుంది. పనిచేస్తున్నాముఅని భక్తిని విడిచిపెట్టవద్దు. పని, భక్తి రెండూ కలుపుకొని జీవించండి.

20-11-2001



ఓం నమో భగవతే శ్రీ రమణాయ

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 04-11-2001, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఏదైనా పనిచేసేటప్పడు చేస్తే ఇష్టంతోచేస్తాము లేకపోతే అయిష్టంవలన చేస్తాము. ఇలా పనిచేయటంవలన చిత్తశుద్దిరాదు. ఇష్టాయిష్టములతో పనిచేయటంవలన పునర్జన్మహేతువులు పెరిగిపోతాయి. పనిచేసేటప్పడు ఇదిధర్మామా, కాదా అని ఆలోచించుకొని ఆపనిచేయాలి. భగవద్గీత మనకు Text Book వంటిది. ఎవరైనా ఏదైనా చెప్పినప్పడుగాని, మనం ఏదైనా పనిచేసేటప్పడుగాని అది భగవద్గీతకు అనుగుణంగాఉంటే తీసుకోండి లేకపోతే వదిలివేయండి. పనిచేసేటప్పడు ఇష్టంతోచేసినా, అయిష్టంతో చేసినా అది నిన్ను బంధిస్తుంది. నీవు చేసేపని ఎందుకు చేస్తున్నావు, ఏభావంతో చేస్తున్నావు అనేది భగవంతుడుచూస్తాడు, ఆయన కళ్ళు మనం మూయలేము. మనహృదయంలో అంతర్యామిగాఉన్న భగవంతుడు మనకు అనుభవంలోనికి వచ్చేవరకు చావుపుట్టుకలను ఎవరూఆపలేరు, ప్రకృతి నిన్నువెంటాడుతూనేఉంటుంది. ప్రకృతిలో మంచి, చెడూకూడా ఒకభాగం. ప్రకృతిలో చెడ్డ ఎందుకుఉందిఅని అనుకోకూడదు. అదికూడా ప్రకృతిలో ఒకభాగం. ఆ చెడ్డ మంచివారిని ఇంకా మంచివారిగా, జ్ఞానులుగా చేయటానికి ఉపయోగపడవచ్చు. ప్రకృతిని దాటినతరువాత అందరూ సమానమే. రాగద్వేషములులేకుండా పని పనికోసమేచేస్తే మనం భగవదనుగ్రహానికి పాత్రులవుతాము. మనకు విషయానందం తెలుసు, ఆత్మానందంతెలియదు. ఆత్మానందమును అనుభవంలోనికి తెచ్చుకోవటానికి చేసే ప్రయత్నమే సాధన. ఆత్మానందం అనుభవంలోనికివస్తే ఇంక దేహాలు ధరించవలసిన పనిలేదు. మనం ఆత్మానందంలో స్థిరపడాలి.

ఈమాట బాగా గుర్తుపెట్టుకోండి. మనజీవితంలో ఏది best portion అని Words Worth చెప్పాడుఅంటే Nameless, formless and unremembered act is the best portion of your life అని చెప్పాడు నీరూపాన్ని, నీనామాన్ని మర్చిపోయి పనిచేయటమేకాదు, నీవు చేసినపని మరల నీకు జ్ఞాపకం రాకూడదు అలా జీవించిన కాలంమాత్రమే నీ జీవితంలో ఉన్నతమైన, ఉత్తమమైన భాగంఅని Words Worth చెప్పాడు, మీరు పనిచెయ్యండి కాని ఎలా పనిచేస్తే మీకుజ్ఞానం కలుగుతుందో తెలుసుకొని పనిచెయ్యండి. అన్నిగొడవలకు, అశాంతికి మనలోఉన్న స్వార్థమేకారణం. ఈ దేహమేనేనుఅనుకొన్నంతకాలం స్వార్థంమనలను విడిచిపెట్టదు. స్వార్థంఉన్నంతకాలం నిర్మాణాత్మకమైన పనులుచేయలేము. తప్పలు

అందరూచేస్తారు. తెలివైనవారు వాటిని కప్పిపుచ్చుకొంటారు, తెలివితక్కువవారు బయటపడతారు. విమర్శించేవారు ఎవరూ మంచిపనిచేయరు. మనం మంచిపనిచేయటంలేదు అనే వెలితి వారికి తెలుస్తుంది. ఆవెలితిని కప్పిపుచ్చుకోవటంకోసం మంచివారిని విమర్శిస్తూఉంటారు. మనస్సు ఏకారణంవలన బయటకువస్తోందిఅనేది చూసుకోండి. వాసనవలన మనస్సు బయటకువస్తుంది. మీకు దేహవాసనఉన్నా, లోకవాసనఉన్నా, శాస్త్రవాసనఉన్నా ఏవాసనఉన్నా దానిని నెమ్మదిగా తగ్గించుకొంటూరావాలి. వాసనలుఅన్నీ నిశ్శేషంగానశించాలి. ఒక చిన్నవాసనఉన్నా అది పునర్జన్మను తీసుకొనివస్తుంది. నీవుచేసే సాధనల ప్రయోజనం ఏమిటిఅంటే ఈ దేహమునేనుకాదు అని నీకు అనుభవంలోనికి రావాలి. మీరు పూజచేయండి, జపంచేయండి, గుడులుచుట్టూ, తులసిచెట్టుచుట్టూ తిరగండి ఎన్నిచేసినా వీటివలన మీస్వరూపం ఏమిటో మీకుతెలియబడాలి. మీరుచేసే సాధనలవలన మీస్వరూపం మీకు అనుభవంలోనికిరావాలి, లేకపోతే అల్లరిమిగులుతుంది. జ్ఞానికి తప్పించి దేహమునేనుఅనేతలంపు అందరికి ఉంటుంది. అది నిజంకాదుకాని అదినిజంఅనినీవు అనుకొంటున్నావు. అక్కడనుండి దుఃఖం ప్రారంభమవుతుంది. దేహమునేనుఅనే తలంపును నీవుఎవరు? అని ప్రశ్నించు అప్పడు అది ఉపసంహరింపబడుతుంది. దేహమునేనుఅనే తలంపును అలాగేఉంచుకొని పూజలు, యజ్ఞాలుచేసి గొప్పగొప్పలోకాలకు వెళ్ళినా తిరిగి ఈభూమిమీదకు రావలసిందే. ఇక్కడ సాధనచేసి దేహమునేనుఅనే తలంపును తొలగించుకోవలసిందే. మీకు వీక్‌మైండ్‌ఉంది అనుకోండి. మీమనస్సుకు బలం రావటంకోసం భగవంతుడే ఇతరులచేత మిమ్మల్ని తిట్టిస్తాడు. ఇదిఅంతా భగవంతుడే చేయిస్తున్నాడుఅని మీకు తెలియక మీరు వారిని తిరిగి తిట్టేస్తారు. నీకు మనోబలం పెంచటంకోసం ఇదిఅంతా భగవంతుడే చేయిస్తున్నాడు. నీసహనానికి పరీక్షలుపెడుతున్నాడు. నిన్ను కష్టాలుపెట్టటానికి ఇది భగవంతుడు చేయటంలేదు. నీమనస్సుకు బలం రావటంకోసం, ఏకాగ్రత రావటంకోసం, జీవితంలోవచ్చే ఇబ్బందులను ఎదుర్కోవటంకోసం భగవంతుడే ఇవిఅన్నీ చేస్తున్నాడు. అన్నీ చేసేది భగవంతుడే. నీకు మనోబలం చేకూర్చి, నీమనస్సును నిర్మలంచేసి, పవిత్రంచేసి ఆయనస్వరూపాన్ని ఇవ్వటానికే ఇదిఅంతా భగవంతుడు చేస్తున్నాడు.

మన హృదయంలోఉన్న భగవంతుడు మనకు తెలియకుండా మనలోఉన్న వాసనలే మనకు అడ్డువస్తున్నాయి. ఈ వాసనలవలన మనం నష్టపోతున్నాముఅని ఇప్పడు మనకు తెలిసింది. వాటిని తొలగించుకోవటానికి సాధనచేస్తున్నాము. అవిఅంత తేలికగాపోవు. వాసన ఎంతబలంగాఉందో అంతబలంగా మనం సాధనచేయాలి. పూర్వజన్మలలో సాధనచేసినవారికి అవి తొందరగాపోతాయి. వాసనలుపోతున్నాయి అనుకోండి కొంచెం, కొంచెంగా జ్ఞానంవస్తుందా లేక ఒకోసారివస్తుందాఅని అడుగుతున్నారు. సూర్యుడు ఉదయించాక కొంచెం, కొచెంగా వెలుతురురాదు. ఒకేసారి వెలుతురువస్తుంది, చీకటిపోతుంది. అలాగే వాసనలు పూర్తిగా నశించినవెంటనే జ్ఞానంకలుగుతుంది, అజ్ఞానంనశిస్తుంది. ఎంతశ్రవణంచేస్తున్నా సందేహాలు పోవటంలేదు, ఒకటితరువాతఒకటివస్తున్నాయి అంటున్నాడు. ఈ సందేహాలుఅన్నీ ఎవరికివస్తున్నాయి? దేహమునేనుఅనేమొదటితలంపుకు వస్తున్నాయి. దానిని తీసి ఒకప్రక్కనపెట్టు ఇంక సందేహాలురావు. దానిని తొలగించుకోకుండా లోపలఆత్మఅలాఉంది, ఇలాఉందిఅని ఊహించుకోవద్దు. నేనుఅనేమొదటితలంపు నశించినవెంటనే లోపలఉన్నఆత్మ అది ఎలాఉందో అలా నీకుతెలియబడుతుంది. నీవుఏద్వైతేకాదో వాటిని ఇదినేనుకాదు, ఇదినేనుకాదుఅని గెంటుకొంటూవెళితే నీవుఏద్వైతేఅవునో అదిమిగులుతుంది. పోగొట్టుకోవలసింది పోగొట్టుకొంటే అప్పడు ఉన్నది ఉన్నట్లుగా నీకువ్యక్తమవుతుంది. ఆత్మఅలాఉంది, ఇలాఉంది అనిఅనుకోవద్దు. నీవు అనుకొన్నట్లు అదిలేదు. అదినీతలంపులమీద ఆధారపడిలేదు. అది ఒక తలంపుకాదు. అది నీతలంపులకు, భావాలకు అతీతంగాఉంది. అదేనిజం, అదేభగవంతుడు, అదేచైతన్యం. మనం అక్కడికి మేల్కోవాలి. అప్పటివరకు పునర్జన్మలు వెంటాడుతాయి. నిప్పదగ్గరకు వెళ్ళేకొలది చలిపోతుంది అలాగే నీహృదయంలోఉన్న సత్యవస్తువును సమీపించేకొలది నీమానసికబాధలుఅన్నీపోతాయి, నాకుఒకదేహంఉంది, నాపేరుఇది, నేనుఅదిచేసాను, ఇదిచేసాను అనే దుమ్ముఅంతా రాలిపోతుంది; నీ ప్రారబ్దకర్మఅంతా కాలిబూడిదఅయిపోతుంది, అప్పడు శాంతివచ్చివరిస్తుంది. నీఇష్టమునుబట్టి, అయిష్టమునుబట్టి, కోరికలనుబట్టి నీవుపనిచేస్తున్నావు. ఇవిఅన్నీ మర్చిపోయి నన్ను సంతోషపెట్టటానికి నీ జీవితంలో ఒకచిన్నపనిఅయినా చేసావాఅని భగవంతుడు అడుగుతున్నాడు.

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 24-11-2001 శని | తాడేపల్లిగూడెం | డి.ఆర్.గోయింకా మహిళా కళాశాలల ఆడిటోరియం, కడకట్ల, ఉదయం 10 గంటలకు |
| 28-11-2001 బుధ | పాతాళ్లమెరక | కె.వి.కె. రాజు స్కూలువద్ద |
| 28-11-2001 టు 07-12-2001 | | అరుణాచలం క్యాంపు |
| 30-11-2001 శుక్ర | అరుణాచలం | దీపోత్సవం |



భూమిమీద నివశించే జీవులను అనుగ్రహించే నిమిత్తం జ్యోతి స్వరూపుడైన శివుడు గిరిరూపంలో తిరువణ్ణామలైలో వెలిశాడు. అరుణాచలం మాంసనేత్రాలకే శిలాకారంగాని, గిరి అసలు స్వరూపము జ్యోతిరూపమే. అందుచేత శివుడు జ్యోతి స్తంభంలా ఆవిర్భవించిన రోజున, అనగా కార్తీక మాసంలో, కృత్తికా నక్షత్రలగ్నంలో, పెద్దగుడిలో వెలిగించిన జ్యోతిని, 2668 అడుగుల ఎత్తున్న అరుణగిరి శిఖరంపై, ప్రదోష సమయం, అనగా సాయంత్రం ఆరుగంటలకు, గుడినుంచి తీసుకువెళ్లిన జ్యోతితో, శిఖరంపై జ్యోతిని వెలిగిస్తారు. ప్రతి సంవత్సరం తేజోరూపంలో దర్శనమిస్తానని పరమేశ్వరుడు వాగ్దానం చేశాడు. కార్తీకదీపం వెలిగించే రోజున సుమారు 25 లక్షల మంది, దీప దర్శనం చేసుకొని, గిరిప్రదక్షిణ చేస్తారు. ఆ జ్యోతి దర్శనానికి దేవతలు, సిద్ధపురుషులు అనేక రూపాలలో భూమికి దిగివస్తారు.

జ్ఞాన సంబంధరు, అప్పరు, మాణిక్యవాచకరు, భగవాన్ శ్రీ రమణ మహర్షి వంటి భక్తిపారవశ్యత కలవారికి, గిరి తన భౌతిక స్వరూపాన్ని వీడి, జ్యోతి స్వరూపముగా వ్యక్తమైనది. జ్యోతి స్వరూపుడయినను, స్థూలంగా గిరిగా నేనుండుట, లోకమును అనుగ్రహించుటకే, నన్ను ధ్యానిస్తూ ప్రదక్షిణ చేసినవారు తరింతురు అని శివుడు చెప్పెను.

మూడువేల సంవత్సరాల క్రితంనాటి తమిళ తాళపత్ర గ్రంథమైన "తోల్ కప్పియమ్" లో కార్తీకదీపం గురించి పేర్కొనబడి ఉన్నది. మోక్షమే ఇచ్చే ఈ గిరికి, కోరికలు తీర్చుట ఒక లెక్కా, అని భగవాన్ శ్రీ రమణ మహర్షి అన్నారు. ఇంత మహిమగల గిరిని, కార్తీక దీపాన్ని దర్శనం చేసుకొని, గిరి ప్రదక్షిణచేసి మోక్షలాభం పొందండి.

ఈ సంవత్సరం నవంబరు 30వ తేదీన కార్తీక దీపోత్సవం జరుగును.



పాలకొల్లు బంగారువారి చెరువుగట్టు ఆదిత్యా కాలనీలో వేంచేసియున్న
శ్రీ షిర్డి సాయిబాబావారి ఆలయంలో
ది. 5-11-2001 నుండి 11-11-2001 వరకు

**శ్రీశ్రీశ్రీ షిర్డి సాయిబాబా వారి దివ్యలీలలు - హరికధాగానము**

మరియు ది.11-11-2001 ఆదివారం రాత్రి గం॥ 9-00 లకు

**శ్రీ షిర్డి సాయిబాబా సమాధి జ్యోతి**

కార్యక్రమములు అత్యంత వైభవముగా, కన్నుల పండువుగా నిర్వహించబడినవి. ఈ కార్యక్రమానికి వేలాదిసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రమణ భాస్కర పాఠకులకు మనవి

సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనాలను అందించటానికి మేము చేస్తున్న కృషిని ప్రోత్సహిస్తున్న పాఠకులకు ధన్యవాదములు. పోస్టల్ చార్జీలు పెరిగిన కారణంగా ది. 23-9-2001 (సద్గురు శ్రీ నాన్నగారి జన్మదినోత్సవం) నుండి సంవత్సర చందా రూ॥ 150/- లుగా నిర్ణయించడమైనది. మీరు చెల్లించిన సంవత్సర చందాకు ది. 23-9-2002 వరకు క్రమం తప్పకుండా ముద్రించిన పత్రికలు అందుతాయి. గమనించగలరు. మీరు యం.ఓ / డి.డి. / నగదు రూపంగా పంపించవలసిన చిరునామా :

**శ్రీ పి. శ్రీరామరాజు** ("రమణ భాస్కర" కొరకు)
శ్రీ రమణ క్షేత్రం, **జిన్నూరు - 534 265,** ప॥గో॥ జిల్లా, ఆంధ్రప్రదేశ్

**గమనిక : రమణ భాస్కర సం॥ర చందా ఇంతవరకు పంపనివారు దయచేసి వెంటనే పంపగలరు.**